సాక్షి ఒడిశా

బుధవారం । 7 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 3,27,648

బంగారం 3 గ్రాముల 870 మిల్లీ గ్రాములు

వెండి 20 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఉక్కిరిబిక్కిరి..!

ఝార్సుగుడ జిల్లాలోని ఒక ప్రైవేట్ పెల్లెట్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం అత్యంత విషపూరితమైన కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీకయ్యింది.

-8లో



హిరాకుద్‌లో పెరిగిన నీటిమట్టం

సంబల్‌పూర్ జిల్లాలోని హిరాకుద్ జలాశయంలోకి నిరంతరం వరద నీరు చేరుతుండడంతో నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది.

-8లో

న్యూస్‌రీల్

కలెక్టరేట్ వద్ద రైతుల ఆందోళన



ఆందోళన చేపడుతున్న రైతులు

పర్లాకిమిడి: పట్టణంలోని కలెక్టరేట్ వద్ద రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. గుసాని సమితి బాగుసల గ్రామంలోని మహేంద్రతనయ క్యాచ్‌మెంట్ ఏరియాలో కాలవ పూడికతీత పనులు చేపట్టకపోవడం వలన సాగునీరు అందక సుమారు 300 ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతులు ఎ.జగన్నాయకులు, వై.చిట్టిబాబు, టి.వెంకట్రావు తదితరులు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌ను కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన స్పందించి చిన్ననీటి పారుదల శాఖ ఇంజినీర్‌తో ఫోనులో మాట్లాడారు. తక్షణమే బాగుసల గ్రామంలో కాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

గంజాయి ముఠా అరెస్టు

జయపురం: ఒక గంజాయి ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులను హర్యానా పోలీసులు అరెస్టు చేశారు. జయపురం పట్టణ పోలీసుల సహకారంతో అరెస్టైన వారిలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ హుసేన్ అన్సారి, మల్కన్‌గిరి జిల్లా ముండిగుడకు చెందిన రవీంద్ర ఖీలో, బొరిగుమ్మ సమితి కమతా గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ పాణిగ్రాహి, జయపురం సమితి పంపుణి గ్రామానికి చెందిన ఆదిత్య మహంతిలు ఉన్నట్లు పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. మహ్మద్ హుసేన్ జయపురం ఆదర్శ నగర్ కాలనీలో, రవీంద్ర ఖొర, కిరణ కుమార్ పాణిగ్రాహి, ఆదిత్య మహంతిలు స్థానిక గ్లోబల్ ఆస్పత్రి ప్రాంతంలో కలిసి నివసిస్తున్నారు. ఆ నలుగురుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన తర్వాత వారిని హర్యానా పోలీసులకు అప్పగించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా గత నెల 30వ తేదీన హర్యానాలో అక్కడి పోలీసులు 2 క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నారు. వారికి పట్టుబడిన నిందితుడు దర్యాప్తులో ఇచ్చిన వివరాలతో ఒడిశాలో గంజాయి నలుగురు వద్ద కొన్నట్లు తెలుపగా, అక్కడి నుంచి ఒక పోలీసు టీమ్ ఈనెల 4వ తేదీన జయపురం వచ్చి పట్టణ పోలీసులను సంప్రదించారు. అనంతరం వారి సహకారంతో అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

అభివృద్ధికి వ్యాపారుల సహకారం అవసరం



వ్యాపారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నర్సింగ్

మల్కన్‌గిరి: జిల్లా అభివృద్ధి జరగాలంటే వ్యాపారుల సహకారం అవసరమని మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి అన్నారు. జిల్లా కేంద్రంలో వ్యాపారులతో సమావేశాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మల్కన్‌గిరిలో రింగ్ రోడ్డు, రైల్వేలైన్, విమానాశ్రయం కార్యకలాపాలు ఇతర అభివృద్ధి పనుల గురించి చర్చించారు. సమావేశంలో వ్యాపారి తాపాన్ సన, మల్కన్‌గిరి వ్యాపారి సంఘ అధ్యక్షుడు సురేష్ సుమాని, అసోసియేషన్ సభ్యుడు దివాకర్ పాల్, ఈశ్వర్ పట్నాయక్, మల్కన్‌గిరి బీజేపీ ప్రెసిడెంట్ నిమాయి పాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి గుణుపూర్ సమస్యలు



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్నటువంటి నవ నిర్మాణ సమితి సంఘం అధ్యక్షుడు అక్షయ్ కుమార్ దాస్, సాధారణ కార్యదర్శి రంజిత్ పాడి, సమాజ సేవకుడు జీఎస్ పండ తదితరుల బృందం ఢిల్లీలో మంగళవారం కలిసింది. ఈ మేరకు పలు సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. గుణుపూర్‌లో కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనం నిర్మించాలని కోరారు. ఐదేళ్ల క్రితం దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 8 ఎకరాల స్థలం నిరుపయోగంగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ స్థలం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆ స్థలంలో భవనం నిర్మించాలని కోరారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న గుణుపూర్‌లో విద్యారంగం మరింత అభివృద్ధి సాధించాలంటే నవోదయ విద్యాలయాన్ని సైతం ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి ప్రధాన్ పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చేయి..చేయి కలిపి..!

అసలే మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం.. పైగా అభివృద్ధి అంతంత మాత్రం. దీనికి తోడు గ్రామానికి వెళ్లేందుకు ఉన్నటువంటి చిన్నపాటి కల్వర్టు సైతం ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఫలితంగా మల్కన్‌గిరి జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా ఆండ్రపల్లి పంచాయతీ రామ్‌గూడ గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో మహిళలు నడుం బిగించారు. స్థానిక మా లక్ష్మి డ్వాక్రా సంఘానికి చెందిన మహిళలంతా కలిసి కల్వర్టు సమీపంలోని మట్టిని తీసుకొచ్చి రహదారి నిర్మాణం చేపట్టారు. దీంతో వారిని స్థానికులు ప్రశంసించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. – మల్కన్‌గిరి









పోలవరం జలాశయం

పోరువరం..!

- పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్న బీజేడీ బృందం
- ప్రాజెక్టుతో ఒడిశాకు నష్టమని ఆరోపణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకునపెట్టే యత్నం

భువనేశ్వర్:

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు ఒడిశాలోని పొరుగు ప్రాంతాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో అంచనా వేయడానికి ఒడిశాలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిజూ జనతా దళ్ (బీజేడీ) ఒక ప్రత్యేక బృందాన్ని పంపాలని నిర్ణయించింది. మాజీ మంత్రి అతున్ సవ్యసాచి నాయక్ నేతృత్వంలో దేవీ ప్రసాద్ మిశ్రా, ప్రదీప్ మాఝీ, భృగు బక్షిపాత్రోలతో ఏర్పాటైన ఈ కమిటీ మల్కన్‌గిరి ప్రాంతంలో బీజేడీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయి సందర్శనకు బుధవారం బయల్దేరుతుంది. ఈ బృందం పోలవరం ప్రాజెక్టుతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించిన అనంతరం బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు సమగ్ర నివేదిక సమర్పించనుంది.

రగులుతున్న రాజకీయ సెగ

పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టుపై రాజకీయాలు ఒడిశాలో ఊపందుకుంటున్నాయి. ప్రతిపక్ష బిజూ జనతా దళ్ (బీజేడీ) గిరిజనుల ప్రాబల్యం ఉన్న మల్కన్‌గిరి జిల్లాలో దాని ప్రభావాన్ని సమీక్షించడానికి ప్రత్యేక బృందాన్ని పంపడం ద్వారా ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. పర్యటనలో భాగంగా బీజేడీ కమిటీ సభ్యులు మల్కన్‌గిరి జిల్లాలోని మోటు, పాడియా మరియు ఇతర ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తారు. కేంద్రం, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులు మంజూరు చేయడం ద్వారా బీజేపీ ఒడిశాను దెబ్బతీసిందని బీజేడీ నాయకుడు ప్రదీప్ మాఝీ ఆరోపించారు. దీనివలన మల్కన్‌గిరి జిల్లాలో దాదాపు 1400 హెక్టార్ల నుంచి 1500 హెక్టార్ల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుపై ప్రాంతీయ పార్టీ బీజేడీ పోరాటం ఉధృతం చేస్తుందని, అక్కడి ప్రజల ప్రయోజనాలను కాపాడుతుందని పేర్కొన్నారు.

ప్రాజెక్టుతో మల్కన్‌గిరికి కష్టాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం ప్రాజెక్టు ఒడిశాలోని వివిధ జిల్లాల్లో, ప్రధానంగా మల్కన్‌గిరి జిల్లా ప్రజలకు కష్టాలను తెస్తుందని బీజేడీ ఆరోపిస్తోంది. ఈ కారణంతోనే ఈ ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి వ్యతిరేకిస్తున్నట్లు గుర్తు చేసింది. ఛత్తీస్‌గఢ్ కూడా పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకించింది. ఈ ప్రాజెక్టు వల్ల నష్టపోయే ఒడిశా ప్రజలకు సైతం పరిహారం చెల్లించాలని అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి నవీన్ పట్నాయక్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు వల్ల ఒడిశా ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లదని పేర్కొంది. అనంతరం 2010 తర్వాత ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు ఈ అంశంపై సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. పర్యావరణ శాఖ మరియు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి తగిన అనుమతులు పొందకుండానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును కొనసాగిస్తోందని ఆరోపించారు. అనంతరం గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ ఆధ్వర్యంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఫలితంగా ఈ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్‌కు ఆమోదం లభించింది. మరోవైపు జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం పెంచినందున నీటి ముంపు సమస్య పరిష్కారం కాదని ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లు సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో ఒడిశాలోని అనేక ప్రాంతాలు ఎప్పటికైనా నీట మునిగిపోతాయని ఆరోపించాయి.

దొందూ దొందే

పోలవరం జల వనరుల ప్రాజెక్టుతో తలెత్తబోయే సమస్యకు ఉభయ బీజేడీ, బీజేపీలు బాధ్యులని కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ మండిపడ్డారు. క్షేత్రస్థాయి సందర్శనకు బదులుగా బీజేడీ పోలవరం ప్రాజెక్ట్‌ను ఆపడానికి నడుం బిగించాలని సూచించారు. సుదీర్ఘంగా 24 ఏళ్లు అధికారంలో ఉన్న సమయంలో ప్రాంతీయ పార్టీ ఈ సమస్యను ఊగిసలాడించి కాలక్షేపం చేసిందని ధ్వజమెత్తారు. మరోవైపు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కావాలంటే తమ సంకీర్ణ భాగస్వామి అయిన టీడీపీ నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరపడం ద్వారా కూడా ఈ దిశగా అడుగులు వేయవచ్చన్నారు. కాగా మల్కన్‌గిరి జిల్లాలోని గిరిజనులపై పోలవరం ప్రాజెక్టు ప్రభావం మీద సమీక్షించేందుకు పోలవరం డ్యామ్ ప్రాజెక్టుపై హౌస్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాకాలం (బడ్జెటు) సమావేశాల్లో కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీంతో ఒడిశా అసెంబ్లీలో గందరగోళం ఏర్పడింది. కాంగ్రెస్ శాసన సభ నాయకుడు రామ చంద్ర కదం ఒడిశాలోని బాధిత ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ఆంధ్రప్రదేశ్‌లో నీటి పారుదల ప్రాజెక్టును ప్రోత్సహిస్తున్నందుకు కేంద్రాన్ని నిందించారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

రాష్ట్రంలో పరిణామాలపై బీజేపీ ఎమ్మెల్యే బాబు సింగ్ స్పందించారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేడీ రాజకీయ విన్యాసాలకు పాల్పడుతోందన్నారు. బీజేడీ 24 ఏళ్లపాటు అధికారంలో కొనసాగిందని, ఆ సమయంలో కేంద్రాన్ని ప్రభావితం చేసి ఉండాల్సిందని పేర్కొంది. చర్చలు కొంత పరిష్కారానికి దారితీసేవన్నారు. అప్పుడు సమస్యలను లేవనెత్తక, ఇప్పుడు రంకెలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేడీ కేంద్రంలో మరియు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతోందని దుమ్మెత్తిపోశారు.

జగన్నాథ్ సాగర్‌లో స్నాన వాటికలు ఏర్పాటు

- మున్సిపల్ కార్య నిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్



సాగర్ పనులపై చర్చిస్తున్న అధికారులు, ట్రస్టు కమిటీ సభ్యులు

జయపురం: పట్టణంలోని చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్‌లో గంగానది మోడల్‌గా స్నాన వాటికలు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కార్య నిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జగన్నాథ్ సాగర్ ట్రస్టు కమిటీతో మంగళవారం జరిగిన చర్చల్లో ఈ విషయం వెల్లడించారు. అలాగే సాగర్ పరిధిలో ఆక్రమణలు తొలగించి, మరో 12 ఎకరాల స్థలం జగన్నాథ్ సాగరంలో మమేకం చేయడం జరుగుతుందన్నారు. సాగర్ అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని ట్రస్టు కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పాత బోటింగ్ క్లబ్ నుంచి లక్ష్మీ పండ కూడలి వరకు రెండు రోడ్ల నిర్మాణం జరపాలని కోరారు. ఆక్రమణల తొలగింపుతో నిరాశ్రయులయ్యే 45 కుటుంబాలకు ఖెందుగుడ ప్రాంతంలో పునరావాసం కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు. బిజూ వెండింగ్ కాంప్లెక్స్ వెనుకనున్న 6 ఎకరాల మూడు చేపల చెరువులను సాగర్‌లో కలిపేందుకు చర్చించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, ట్రస్టు కమిటీ సభ్యులు రజినీకాంత నాయిక్, శంకర్ ప్రహరాజ్, నిరంజన్ పాణిగ్రాహి, కునుమున్ పాణిగ్రాహి, రఘు మిశ్ర, జి.వాఘ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనతోనే నూతన ఆవిష్కరణలు



రాయగడ: సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న కలెక్టర్ మహాజన్ తదితరులు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో నిర్వాహకులు

జయపురం: ఆలోచనతోనే నూతన ఆవిష్కరణలు జరుగుతాయని నవరంగపూర్ జిల్లా అగ్రికల్చర్ విభాగ అధికారి జి.వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలో పూల్‌బెడ ప్రాంతంలోని జిల్లా విజ్ఞాన కేంద్రంలో జిల్లాస్థాయి హాక్‌థన్ పోటీలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక అంశంపై పనిచేసేటప్పుడు సుదీర్ఘంగా పరిశీలించాలని సూచించారు. విద్యార్థులకు తాము తయారు చేసే ప్రాజెక్టులపై సంపూర్ణ అవగాహన అవసరమని పేర్కొన్నారు. పోటీల్లో 10 హయ్యర్ సెకండరీ పాఠశాలల నుంచి 23 ప్రాజెక్టులు ప్రదర్శించారు. పోటీల్లో లండిగుడ హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థి బిజయ్ తండి ప్రథమ స్థానంలో, బొరిగుమ్మ ఓఏవీ సంతోష్ కుమార్ భొత్ర ద్వితీయ స్థానంలో, మచ్చర గ్రామ ఓఏవీ సౌమ్య శివ మహంతి తృతీయ స్థానంలో నిలిచారు. వీరు ఈనెల 23వ తేదీన భువనేశ్వర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా విద్యాధికారి డాక్టర్ ప్రశాంత కుమార్ మహంతి, జగన్నాథ్ భొత్ర తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాలలో జిల్లా స్థాయి హెకాథన్ పోటీల్లో భాగంగా సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు చేపట్టారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గుణుపూర్, రాయగడ, గుడారి, రామనగుడ, పద్మపూర్ ప్రాంతాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహాజన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ కనబరిచేందుకు ఇటువంటి తరహా ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి



కలెక్టర్‌ను కలిసిన గ్రామస్తులు



అధ్వానంగా ఉన్న పలమతులసి రహదారి

రాయగడ: సమితి పరిధి దుర్గాపాడు పంచాయతీలోని పలమతులసి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ఈ గ్రామానికి సుమారు 3 కిలోమీటర్ల రహదారి లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అసలే వర్షాకాలం కావడంతో రహదారి పూర్తిగా బురదమయమై నడిచేందుకు సైతం అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన గండాగుడ మీదుగా సుమారు 20 నుంచి 22 కిలోమీటర్ల దూరం పడుతోందని వాపోయారు. దీనికి స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారితో మాట్లాడారు. జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి నిధులు కేటాయించి, త్వరితగతిన ఆ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

ఓబీసీసీ అదనపు చీఫ్ ఇంజినీర్ అరెస్టు



ప్రదీప్ కుమార్ రథ్

భువనేశ్వర్: ఒడిశా బ్రిడ్జ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఓబీసీసీ) అదనపు చీఫ్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ రథ్‌ను ఒడిశా విజిలెన్స్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడికి సంబంధించిన 12 ప్రాంతాల్లో సోమవారం ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో కోట్లాది రూపాయల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించారు. అలాగే మంగళవారం కొనసాగించిన సోదాల్లో దాదాపు రూ.1 కోటి విలువైన మరో 3 ఇండ్ల స్థలాలను ఢెంకనాల్‌లో గుర్తించారు. ఒడిశా విజిలెన్స్ విభాగం మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం ప్రదీప్ కుమార్ రథ్ ఆస్తులపై జరిపిన సోదాల ఆధారంగా, అతని మరియు అతని కుటుంబ సభ్యుల పేర్లతో భువనేశ్వర్‌లో 2 బహుళ అంతస్తుల భవనాలు, 2 అధిక విలువైన ఫ్లాట్లు, వేర్వేరు చోట్ల 45 ప్లాట్లతో సహా ఆదాయానికి అసమాన ఆస్తులను ఆర్జించినట్లు (సుమారు రూ.1 కోటి విలువైన మరో 3 ప్లాట్లు) కనుగొన్నారు. వీటితో పాటు 1 మందుల దుకాణం, స్టోన్ క్రషర్ యూనిట్, సుమారు 1 కిలో బంగారం, రూ.1.62 కోట్లకు పైగా డిపాజిట్లు, 2 విలాసవంతమైన నాలుగు చక్రాల వాహనాలు, 2 జేసీబీలు, 1 ఎక్స్‌కవేటర్, ఒక రాక్ బ్రేకర్ మొదలైనవి బయటపడ్డాయి. అతను ఈ ఆస్తులకు సంబంధించి సంతృప్తికరంగా జమా ఖాతాలు వెల్లడించనట్లు విజిలెన్సు వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ప్రదీప్ కుమార్ రథ్‌ను అరెస్టు చేయడం జరిగిగిందన్నారు. న్యాయస్థానంలో ప్రవేశ పెట్టారు. ఈ నేపథ్యంలో అతనిపై కటక్ విజిలెన్స్ పోలీస్ ఠాణాలో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

బోటు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి



వాడ ధర్మారావు(ఫైల్)

సోంపేట: మండలంలోని గొల్లగండి పంచాయతీ రామయ్యపట్టణం గ్రామానికి చెందిన మత్స్యకారుడు వాడ ధర్మారావు(50) చెన్నైలో బోటు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారావు జీవనాధారం కోసం చెన్నైలో వలస మత్స్యకారుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈయనకు భార్య జానకి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా, ఇతర రాష్ట్రాల్లో జరిగిన ప్రమాదాల్లో మత్స్యకారులు మృతి చెందితే అక్కడి అధికారులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయడం లేదు. దీంతో ప్రమాద బీమా అందడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందజేసి వలస మత్స్యకారులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

రెండు మండలాల హద్దులు గుర్తింపు



ఎచ్చెర్ల, రణస్థలం మండలాల హద్దుల్లో సర్వే చేస్తున్న సర్వేయర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణంలో ఉంది. ఈ గ్రామం రణస్థలం మండలం హద్దుగా ఉంది. దీంతో తమ మండలంలోనే హద్దులు నిర్ణయించి ఫిషింగ్ హార్బర్ పనులు కొనసాగించాలంటూ రణస్థలం మండలం కొమ్మువారిపేట గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫిషింగ్ హార్బర్ పనులు కొంత కాలం నిలిచిపోయాయి. ఈ నెల 3న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పనులు పరిశీలించారు. హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ, సర్వే విభాగాలను ఆదేశించారు. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో ఎచ్చెర్ల, రణస్థలం తహశీల్దార్లు ఎ.సింహాచలం, ఎన్.ప్రసాదరావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు. ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెం పరిధిలో 505 /18 సర్వే నంబర్ పరిధిలో హార్బర్‌కు స్థలం కేటాయించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



అంబులెన్సులో క్షతగాత్రుడు

బూర్జ: మండలంలోని పెద్దపేట జంక్షన్‌లో పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సీతంపేట మండలం వలగెడ్డ గ్రామానికి చెందిన ఆరిక మణికంఠ ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి వెనుక భాగానికి బలంగా ఢీకొట్టాడు. రోడ్డుపై పడి గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి 108 వాహనంలో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కార్యాలయంలో చోరీ

కాశీబుగ్గ: కాశీబుగ్గ రూరల్ వాటర్ సప్లయ్ జూనియర్ ఇంజినీర్ కార్యాలయంలో చోరీ జరిగింది. కార్యాలయం వెనుక భాగంలోని కిటికీ విరగ్గొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు విలువైన రికార్డులను నాలుగు గోనె సంచుల్లో వేసి మూటలుగా కట్టి ఎత్తుకెళ్లారు. వాటిని సమీపంలోని రద్దు షాపులో విక్రయించారు. ఈ దృశ్యాలు పక్కనున్న ఎంపిడీవో కార్యాలయంలోని సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. సీసీ ఫుటేజ ఆధారంగా అనుమానితులను గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఎస్పీని కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ



ఎస్పీ మహేశ్వరరెడ్డితో డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ డీఎస్పీగా వచ్చిన పి.శ్రీనివాసరావు మంగళవారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గుంటూరు జిల్లా డీసీఆర్బీ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో కాశీబుగ్గ, మందస ఎస్ఐగా కూడా పనిచేశారు.

ఉక్కిరిబిక్కిరి..!

- ఝార్సుగుడ పెల్లెట్ ప్లాంట్‌లో విష వాయువు లీక్
- ఊపిరాడక ఒకరు మృతి
- ఆరుగురి పరిస్థితి విషమం



ప్లాంట్ ప్రాంగణంలో గుమిగూడిన కార్మికులు

భువనేశ్వర్: ఝార్సుగుడ జిల్లాలోని ఒక ప్రైవేట్ పెల్లెట్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్లాంట్‌లో అత్యంత విషపూరితమైన కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీకయ్యింది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందగా, మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఝార్సుగుడ జిల్లా బుడిపాదొరా వద్దనున్న ఒరిస్సా మెటాలిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌లో కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీక్ కావడంతో కాంట్రాక్ట్ కార్మికుడు బరుణ్ ప్రధాన్ మృతి చెందాడు. తీవ్ర అస్వస్థతకు గురైన మరో 6 మందిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. అయితే లీక్‌కు ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడలేదు. ఈ సంఘటన గురించి వివరణాత్మక సమాచారం తెలియజేసేందుకు ప్లాంట్ అధికార వర్గాలు అందుబాటులో లేరు. మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు బరుణ్ ప్రధాన్ బ్రజరాజ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఝార్సుగుడ మండలం తెచ్చొబహాల్ గ్రామస్తుడుగా గుర్తించారు. ఘటనతో ప్లాంటు పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు సిబ్బందిని సకాలంలో రంగంలోకి దించారు. ఈ సంస్థలో ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుని అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా, ప్లాంటు యాజమాన్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని కార్మిక వర్గం ఆవేదన వ్యక్తం చేసింది.

రాష్ట్రంలో నీట్ పేపర్ లీక్ లింక్

- భువనేశ్వర్‌లో నిందితుడు అరెస్టు



భువనేశ్వర్: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్ (నీట్-యూజీ) 2024 పేపర్ లీకేజీ కేసుకు సంబంధించి సీబీఐ భువనేశ్వర్‌కు చెందిన ఒకరిని అరెస్టు చేసింది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీలో పాత్రధారిగా భావించి అరెస్టు చేసినట్లు సమాచారం. నిందితుడు స్థానికంగా నివాసముంటున్న సుశాంత్ కుమార్ అలియాస్ సుశాంత్ సామంతగా గుర్తించారు. ఆయన స్థానిక సాహిద్ నగర్‌లో పలు ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్‌ను నడుపుతున్నట్లు సమాచారం. అతడిని శనివారం అరెస్టు చేసి ఆదివారం పాట్నాకు తరలించారు. అనంతరం సీబీఐ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయస్థానం తదుపరి విచారణ కోసం 5 రోజుల రిమాండ్‌కు సీబీఐకు అనుమతించింది.

పరీక్ష రోజున బట్టబయలు

నీట్ ప్రశ్నపత్రం లీక్‌ను పరీక్ష రోజు ఈ ఏడాది మే 5న పాట్నా పోలీసులు తొలిసారిగా బయటపెట్టారు. బీహార్ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓయూ) నలంద జిల్లాకు చెందిన ప్రధాన సూత్రధారి సంజీవ్ ముఖియాతో సహా పలువురిని గుర్తించింది. కేంద్ర విద్యా శాఖ సిఫారసు మేరకు కేసు తదుపరి దర్యాప్తు సీబీఐకి బదిలీ చేశారు. ఈ కేసులో ప్రధాన పాత్రధారిగా భావిస్తున్న రాకేష్ రంజన్ అలియాస్ రాకీ అనే వ్యక్తిని గత నెలలో అరెస్టు చేసింది. అలాగే భరత్‌పూర్ మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు ఎంబీబీఎస్ విద్యార్థులను కొన్ని రోజుల తర్వాత అరెస్టు చేశారు. నీట్ – యూజీ ప్రవేశ పరీక్ష రోజు హజారీబాగ్‌లో ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థి కుమార్ మంగళం బిష్ణోయ్, మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి దీపేందర్ కుమార్ ఉన్నట్లు సాంకేతిక నిఘా వర్గం నిర్ధారించింది. వీరిరువురితో కలిసి పనిచేసినందుకు జంషెడ్పూర్ ఎన్ఐటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయినటువంటి శశికాంత్ పాశ్వాన్‌ను సైతం అరెస్టు చేశారు. అదేవిధంగా రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కి చెందిన మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థిని సురభి కుమారిని కూడా కుంభకోణంలో పాత్రధారిగా ఆరోపించి అరెస్టు చేశారు. నీట్ ప్రవేశ పరీక్ష ముందు రోజు మే 4న పాట్నాలోని లెర్న్ ప్లే స్కూల్‌తో అనుబంధించబడిన బాలుర హాస్టల్ కేంద్రంగా ప్రశ్నపత్రం, సమాధానాల కీలను లీక్ చేసి ప్రసారం చేసినట్లు సాక్ష్యాలను సేకరించేందుకు దర్యాప్తు సంస్థ ఏఐ మరియు అధునాతన ఫోరెన్సిక్ పద్ధతులను ప్రయోగించింది.

విద్యపై సచేతన శిబిరం



మాట్లాడుతున్న వర్సిటీ అధ్యాపక సిబ్బంది

జయపురం: స్థానిక విక్రమదేవ్ యూనివర్సిటీ బీఈడీ విద్యార్థులు విద్య ప్రాధాన్యతలపై మంగళవారం సచేతన శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా బొరిగుమ్మ సమితి నువాగాం, నకులగుడ, మఝిగుడ గ్రామాలను సందర్శించారు. నువాగుడ గ్రామంలోని ప్రభుత్వ ఎస్ఎస్‌డీ బాలికోన్నత పాఠశాలను సందర్శించి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. అలాగే మొక్కలు పెంచడం వలన కలిగే ప్రయోజనాలు, మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామీణ ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై సర్వే నిర్వహించారు. అదేవిధంగా చంపాపాదర్ ఇకో పార్క్‌ను సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు అధ్యాపక బృందం సభ్యులు ఉన్నారు.

ద్విచక్ర వాహన‘చోరుడు’ అరెస్టు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో రెండో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో సిబ్బంది వాహనాలు పోతుండటంతో నిఘా పెట్టిన టూటౌన్ పోలీసులకు అదే చోట మరోసారి చోరీయత్నం చేస్తూ పట్టుబడ్డాడో వ్యక్తి. సీఐ గుండు మోను ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గతంలో రిమ్స్ ఆస్పత్రి బయట పార్కింగ్ చేసిన తమ ద్విచక్ర వాహనాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారంటూ అక్కడి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులుగా ఎస్ఐ హరికృష్ణ తమ సిబ్బందితో కలిసి నిఘా పెట్టించారు. ఈ క్రమంలో మంగళవారం కొమ్ము రాజేష్ అనే వ్యక్తి అదే చోట మరళా చోరీ యత్నం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాజేష్‌ను అదుపులో తీసుకుని అతని వద్ద నుంచి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సందీప్

శ్రీకాకుళం న్యూకాలనీ: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ ముఖ్యంగా బాలికలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐ వి.సందీప్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ అధ్యక్షతన ‘సైబర్–నేరాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు’ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లైసెన్స్, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం నేరమన్నారు. సెల్‌ఫోన్లలో ఫేక్ మెసెజ్‌లకు, రివార్డ్స్, రీచార్జ్ ఫ్రీ, లాటరీ విన్నర్స్ అంటూ వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని హితవుపలికారు. వీలైనంత మేర సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై 1930, ఇతర నేరాలు, అత్యవసర సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కామర్స్ హెచ్‌ఓడీ లబ్బ కృష్ణారావు, లలితాభాయ్, సంతోషి, పావని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హిరాకుద్‌లో పెరిగిన నీటిమట్టం



జలాశయం నుంచి విడుదలవుతున్న వరద నీరు

భువనేశ్వర్: సంబల్‌పూర్ జిల్లాలో హిరాకుద్ జలాశయంలోనికి నిరంతరం వరద నీరు చేరుతుండడంతో నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లోని మహానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ జలాశయంలో నీటి ప్రవాహం గణనీయంగా పెరిగిందని అధికారులు మంగళవారం తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు హిరాకుద్ జలాశయంలోకి 2,74,849 క్యూసెక్కులు నీరు ప్రవహిస్తుండగా, 2,46,765 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. హిరాకుద్ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 630 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 610.17 అడుగులకు తాకింది. ఈ పరిస్థితి దృష్ట్యా అధికారులు 14 గేట్ల ద్వారా జలాశయంలో నిండిన నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ వైపున 10 మరియు కుడి వైపున 4 గేట్ల గుండా వరద నీరు విడుదల అవుతుంది. జూలైలో ఈ సీజన్ మొదటి వరద నీటిని విడుదల చేసేందుకు హిరాకుద్ జలాశయం మొత్తం 67 గేట్లలో 20 స్లూయిస్ గేట్లను అధికారులు తెరిచిన విషయం తెలిసిందే.

కుండపోత వర్షం



పర్లాకిమిడిలో వర్షం పడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలో మంగళవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో గత కొన్ని రోజులుగా ఉక్కతో సతమతమైన ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ వానతో వరి సాగుకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూరింటిపై పడిన చెట్టు



జయపురం: నిరాశ్రయులైన కుటుంబం

జయపురం: పెనుగాలులతో కురిసిన వర్షం కారణంగా బొరిగుమ్మ సమితి బొయిపరిగుడ పంచాయతీ ఖెందుగుడ గ్రామంలో నీలాద్రి భూమియ అనే వ్యక్తి ఇంటిపై చెట్టు పడింది. అయితే ఇంట్లో ఉన్న నలుగురూ ఎటువంటి ప్రమాదం లేకుండా బయటపడ్డారు. ఇంటిపై చెట్టు పడడంతో నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు ఎన్ఎస్ఎస్ పీవోల సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) పీవో (ప్రోగ్రాం అధికారులు)లతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త ఎం.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మెయిన్ సెమినార్ హాల్లో జరిగే ఈ సమావేశానికి పీఓలు విధిగా హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ ఇసుక రీచ్ నుంచి అనధికారంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. రీచ్‌లకు అనుమతులు లేవని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై స్పష్టం చేశారు.

యూపీ నుంచి బంగాళదుంపల దిగుమతి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- త్వరలో సంక్షోభం తొలగిపోతుంది
- మంత్రి కృష్ణచంద్ర పాత్రో వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్రంలో బంగాళదుంపల సంక్షోభం తొలగించేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి బంగాళదుంపలను దిగుమతి చేసేందుకు చొరవ తీసుకున్నట్లు రాష్ట్ర పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో తెలిపారు. నీతి అయోగ్ సమావేశం పురస్కరించుకుని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీతో బంగాళా దుంపల దిగుమతికి సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ముఖాముఖి సంప్రదించినట్లు తెలిపారు. దీంతో రాష్ట్రంలో బంగాళ దుంపల ధర కొంత మేరకు దిగి వచ్చింది. అయితే మరలా మంగళవారం నుంచి తిరిగి ధర పెరగడంతో వినియోగదారుల్లో కలవరం రేగింది. ఈ పరిస్థితిని విభాగం మంత్రి సమీక్షించారు. ఉత్తరప్రదేశ్ నుంచి కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వ్యాపారుల సంఘం ప్రతినిధులు, కోల్డ్ స్టోరేజీల యూనిట్ల యజమానులు, రిటైలర్లతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. మార్కెట్‌లో బంగాళ దుంపలు కిలో రూ.35కు లభిస్తున్నాయన్నారు. అయితే కిలో రూ.40 నుంచి 50కి విక్రయిస్తున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. ఎవరైనా బంగాళాదుంపలను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలితే, సమగ్ర విచారణ అనంతరం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం కూడా బంగాళదుంపలతో కూడిన ట్రక్కులు రాష్ట్రానికి వచ్చాయని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి బంగాళా దుంపల కొనుగోళ్లను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు.

యూపీ నుంచి వచ్చే బంగాళదుంపల్లో నాణ్యత బాగాలేదన్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఉత్తరాది రాష్ట్రం నుంచి సేకరించిన దుంపలు వివిధ ప్రదేశాల్లోని మార్కెట్లలో లభిస్తాయని చెప్పారు. అంచెలంచెలుగా ఈ దిగుమతి పుంజుకుని రాష్ట్రంలో బంగాళదుంపల సంక్షోభం తొలగిపోతుందని అభయమిచ్చారు.

వికసిత్ ఒడిశాపై చర్చ



సీఎం మోహన్‌చరణ్‌తో చర్చిస్తున్న నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు నీతి అయోగ్ ఒడిశా వికసిత లక్ష్యాలను నెరవేర్చేందుకు విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో మద్దతుగా ముందుకు వచ్చింది. ఈ మేరకు నీతి అయోగ్ సీఈవో బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని లోక్ సేవా భవన్‌లో మంగళవారం కలిసి వికసిత్ ఒడిశా వ్యూహంపై చర్చించారు. ఈ చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒడిశాకు వివిధ రంగాల్లో అపారమైన సామర్థ్యం ఉందన్నారు. భారత దేశ వృద్ధికి ఒడిశా గణనీయంగా దోహదపడాలని, 2047 నాటికి దేశంలో గ్రోత్ ఇంజిన్‌గా మారాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్రం 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఒడిశా అభివృద్ధిపై ప్రధాని ప్రత్యేక దృష్టి సారించారని నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధించేందుకు ప్రతీ రాష్ట్రం అనూహ్యంగా ఎదగాలన్నారు. ఒడిశా విషయానికొస్తే తాము రెండు విజన్ డాక్యుమెంట్ల తయారీకి మద్దతు ఇస్తామని తెలిపారు. ఒకటి 2036 మరియు మరొకటి 2047 విజన్ డాక్యుమెంట్లుగా పేర్కొన్నారు. ఈ చర్చలో రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ వేయాలని నిర్ణయించారు. మూడు నెలల్లో ఈ కమిటి వికసిత్ ఒడిశా 2036, 2047 రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తుందన్నారు. సీఎంతో సమావేశానికి ముందు నీతి అయోగ్ సీఈవో అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, ముఖ్యమంత్రి అదనపు ముఖ్య కార్యదర్శి నికుంజ బిహారీ ధొలా తదితరులు పాల్గొన్నారు.

మెట్టవలసలో అదుపులోకి రాని డయేరియా

- 63కు చేరిన బాధితుల సంఖ్య
- పరిశీలించిన డీఎంహెచ్‌ఓ మీనాక్షి



వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

జి.సిగడాం:

మండలంలోని మెట్టవలసను డయేరియా వీడటం లేదు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా మంగళవారం 16 కేసులు నమోదుకావడంతో మొత్తం అతిసార బాధితుల సంఖ్య 63కు చేరింది. వీరిలో 38 మంది శ్రీకాకుళం, రాజాం, పొందూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారంతా గ్రామంలోనే వైద్యం చేయించుకుంటున్నారు. స్థానిక వైద్యాధికారులు బుడుబూరు యశ్వంత్, పేకల సుమబిందు వైద్యసేవలు అందిస్తున్నారు. మరోవైపు సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి, నాయకులు బెవర జగన్నాథం, సీతారాం, శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి జి.గోపిబాల, ఎంపీడీఓ కె.వెంకన్నబాబు, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి ఎస్.రాజారమేష్, ధర్మవరపు సతీష్ పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టుతున్నారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి..

జిల్లాలో డెంగీ, మలేరియా జ్వరాలతోపాటు అతిసార వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. మెట్టవలసలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో మంగళవారం పర్యటించి పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధుల తీవ్రత పెరిగితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సీతామహాలక్ష్మి పాల్ట్రీని సందర్శించి మెట్టవలసలో అతిసార వ్యాధితో బాధపడుతున్నారని సహాయ సహకారాలు అందించాలని ఎండీ కొల్లూరు వెంకట నాగేశ్వరరావును కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, పేడాడ సత్తెరాజు, భాస్కరరావు, ఏఎన్ఎం నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ కెజియా పాల్గొన్నారు.

వలియాసాగరంలో జ్వరాల విజృంభణ

టెక్కలి రూరల్: మండలంలోని వలియాసాగరంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో సుమారు 60 ఇళ్లు ఉండగా ఇప్పటికి 30 మందికి పైగా జ్వరాలబారిన పడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. మరికొందరు ఇంటి వద్దనే ఆర్ఎంపీలతో వైద్యం చేయించుకుంటున్నారు. ఎక్కువ మంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం, బావుల్లో క్లోరినేషన్ చేపట్టకపోవడం వల్లే వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నైపుణ్య విద్యకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్

ఎచ్చెర్ల క్యాంపస్: నైపుణ్య విద్యతోనే ఉత్తమ మానవ వనరులు సాధ్యమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్సలర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అంబుడ్స్ పర్సన్ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్ అన్నారు. ఎచ్చెర్లలోని అంబేడ్కర్ వర్సిటీలో ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల మొదటి ఏడాది క్లాస్‌వర్క్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్‌పై పట్టు అవసరమని చెప్పారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్, ఆటోమొబైల్స్, ఎయిర్‌క్రాఫ్ట్, టెలికాం, ఆగ్రో మెకానిజమ్, టెలివిజన్, వాటర్ సప్లయ్, నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మిషన్ లెర్నింగ్ వంటి రంగాల్లో మంచి ప్యాకేజీలతో విద్యార్థులు ప్లేస్‌మెంట్లు సాధిస్తున్నారని తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపాల్, సివిల్ జడ్జి, వర్సిటీ అంబుడ్స్ పర్సన్ జి.వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని మాట్లాడుతూ ప్రముఖులు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో సేవలు అందించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9న ఎంఆర్‌కళాశాలలో జాబ్‌మేళా

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతీయువకులకు వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత మొబైల్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్ (రెండు సంవత్సరాల అనుభవం) తదితర 100 పోస్టులను భర్తీ చేయనున్నారని, జీతం రూ.13,000 నుంచి రూ.21,000, ఇంటెన్సివ్ ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని వయసు 30 ఏళ్లలోపు, మేనేజర్ పోస్టులకు 33 ఏళ్ల వరకు ఉండాలని, రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ (జెనిక్స్)లో ప్రొడక్షన్‌లో 30, అపరేషన్, మెయింటనెన్స్‌లో 30 పోస్టులను భర్తీ చేస్తారని, జీతం రూ.19,477 నుంచి 20,535 మధ్య ఉంటుందని తుని సమీపంలోని కేశవరంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, బీజెడ్‌సీ, ఎంపీసీ, సీబీజెడ్, డిప్లమో ఇన్ కెమికల్, మెకానికల్, బీటెక్ మెకానిక్‌లో ఉత్తీర్ణులై ఉండాలని వయసు 27 సంవత్సరాలు మించకూడదని, 2017-2024 మధ్య ఉత్తీర్ణులై ఉన్న పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. రిలయన్స్ జియో ఫైబర్‌లో హోం సేల్స్ ఆఫీసర్ 15 పోస్టులను భర్తీ చేయనున్నారని, జీతం రూ.15,000, కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండి, వయస్సు 30 ఏళ్లలోపు ఉండాలని, విజయనగరం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్‌లో ట్రైనీ కేంద్ర మేనేజర్ (ఫీల్డ్‌వర్కు)-130 పోస్టుల భర్తీ జరుగుతుందని జీతం రూ.13 వేలు, పెట్రోల్ చార్జ్, ఇన్సెంటివ్, వసతి సదుపాయం కల్పించనున్నారని, ద్విచక్ర వాహనం కలిగి ఉండాలని విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా వారి పేర్లను ఎంప్లాయిమెంట్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని ఈ నెల 9న విజయనగరంలోని గంటస్తంభం సమీపంలో గల ఎంఆర్‌కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8919179415 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కొత్తూరులో రెండు వసతిగృహాలు

సీతంపేట: గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో వేర్వేరుగా బాల,బాలికలకు రెండు వసతిగృహాలను ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరులో వివిధ కళాశాలల్లో చదువుతున్న గిరిజన బాలురు, బాలికలు ఈ వసతి గృహాల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9490942125, 9652858561 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కట్టమూరికి మానాప్రగఢ శేషసాయి స్మారక పురస్కారం



కట్టమూరి చంద్రశేఖరం

విజయనగరం: సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల త్రివేణి సంగమంగా గుర్తింపు పొందిన మానాప్రగఢ శేషసాయి పురస్కారం డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరంను వరించిందని తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మంగళవారం తెలిపారు. 2024 సంవత్సర పురస్కారం ఈ నెల 10వ తేదీ శనివారం కట్టమూరికి ప్రదానం చేస్తామని చెప్పారు.

అందరి భాగస్వామ్యంతో శిశు మరణాల నివారణ

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

పూసపాటిరేగ:అందరి భాగస్వామ్యంతో మాతాశిశు మరణాల నివారణ సాధ్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత నెలలో జిల్లాలోనే పూసపాటిరేగ పీహెచ్‌సీలో అత్యధికంగా ప్రసవాలు జరడంతో వైద్యాధికారి రాజేష్‌వర్మతో పాటు సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మాతా శిశు మరణాలు 2027 నాటికి ప్రస్తుతం ఉన్న 60 నుంచి 20కి తగ్గించాలన్నారు. ప్రతి గర్భిణికి 15 రోజులకోసారి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలని సూచించారు. ఆగస్టు 20న జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడిమాలజిస్టు వెంకటేష్, వైద్యాధికారి సీహెచ్ఓ చంద్రశేఖరరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రేమ్‌కుమార్, వేదమణి, ఆర్.వి.రమణ, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మద్యంతర మార్పు..!



- ప్రభుత్వ దుకాణాలకు సెలవు
- పాత సీసాలో..కొత్త కిక్కు
- ప్రైవేట్ దుకాణాలవైపే మొగ్గు?
- అక్టోబర్‌లో నూతన పాలసీ

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురంటౌన్: నూతన మద్యం పాలసీకే తమ ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ నుంచి దీనికి సంబంధించిన నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. అక్టోబరు 1 నుంచి కొత్త విధానాన్ని అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది.

మళ్లీ ప్రైవేట్‌కేనా?

గత ఎన్నికలకు ముందు టీడీపీ మేనిఫెస్టోలో కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించారు. ఇది పరోక్షంగా ప్రైవేట్ మద్యం దుకాణాల రాకను సూచిస్తోంది. 2019 ముందువరకు అప్పటి ఉమ్మడి విజయనగరం జిల్లాలో 189 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఉండేవి. వాటి ద్వారానే మద్యం విక్రయాలు జరిగేవి. ప్రతి రెండేళ్లకూ ఓసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించేవారు. కొన్ని కీలకమైన కూడళ్లలో ఉండే వైన్ షాపులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉండేది. రాజకీయ నాయకుల కనుసన్నల్లో అవి నడిచేవి. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..ప్రభుత్వ మద్యం దుకాణాలను నెలకొల్పింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 53 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 8 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండేవి. మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో వేల కోట్ల ఆదాయం సమకూరింది.

పక్క రాష్ట్రాల్లో అధ్యయనం..

నూతన మద్యం పాలసీపై కొద్ది రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొత్త విధానంపై అధ్యయనానికి రాజస్థాన్, యూపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు ఉన్నతాధికారుల బృందాన్ని పంపించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అనంతరం జిల్లాలో జనాభా ప్రాతిపదికన ఎన్ని దుకాణాలు పెట్టాలి, దరఖాస్తు రుసుం, లైసెన్స్ ఫీజులు, నిబంధనలు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో 15 మండలాలున్నాయి. గతంలో ఉన్న దుకాణాల సంఖ్యనే కొనసాగిస్తారా? ఇంకా పెంచుతారా? అన్నది చూడాలి.

పర్యవేక్షణ ఏం చేస్తారు?

నూతన విధానం అమల్లోకి వస్తే మద్యం దుకాణాల పర్యవేక్షణ బాధ్యత ఎవరికి అప్పగిస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ప్రస్తుతం రెండు విభాగాలుగా నడుస్తోంది. ఇందులో ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో) అక్రమ మద్యం నివారణ, మద్యం, స్మగ్లింగ్ కేసులను పర్యవేక్షిస్తూ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. సహాయ కమిషనర్ నుంచి జిల్లాలో ఎస్ఈబీ పోలీస్ స్టేషన్లు ఇందుకోసం పని చేస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ మద్యం డిపోల నిర్వహణ, ప్రభుత్వ మద్యం దుకాణాల బాధ్యతను పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం డిపో మేనేజర్లు, సీఐలు, ఎస్సైలు పనిచేస్తున్నారు. కొత్తమద్యం పాలసీ తీసుకొస్తే రెండు విభాగాలను కలిపేసి, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఉన్నట్లు చేస్తారా..? ఉన్న దాన్ని కొనసాగిస్తారా? అన్నది చూడాలి. మొత్తంగా నూతన ఎక్సైజ్ పాలసీ గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్నట్లే అమలయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఇద్దరు సేల్స్‌మెన్, ఒక సూపర్‌వైజర్ చొప్పున నిరుద్యోగులకు ఉపాధిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది. ఇప్పుడు కొత్త మద్యం విధానం అమలైతే..ప్రభుత్వ దుకాణాలకు మంగళం పాడేసినట్లే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే ఇప్పటికే ఆయా దుకాణాల్లో పని చేస్తున్న వారు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది.

అక్రమంగా ఇసుక తరలింపుపై పరిశీలన



బిల్లుమడ-నేరడి మధ్య ర్యాంపు వద్ద దాచిన జేసీబీని గుర్తించిన అధికారులు



ఇసుక తరలింపు కోసం నులకజోడు వద్ద వేచి ఉన్న లారీలు

భామిని: వంశధార నదీతీరం వెంబడి జరుగుతున్న ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు భామిని మండలంలోని బిల్లుమడ-నేరడి గ్రామాల మధ్య నదీ తీరం నుంచి రాత్రిపూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యవహారంపై వివాదాలు రేగడంతో రెవెన్యూ, మైన్స్ అధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించారు. సోమవారం సాయంత్రం ఏపీఎండీసీ టీఏలు హరనాథ్, శిరీషల ఆధ్వర్యంలో భామిని ఇన్‌చార్జ్ తహసీల్దార్ నిమ్మల శేఖరం, వీఆర్ఓ గెల్లంకి వెంకటరమణల బృందం బిల్లుమడ-నేరడి మధ్య గల ఇసుక ర్యాంపు స్థలాన్ని సందర్శించి అక్రమ రవాణా ఆనవాళ్లు గుర్తించారు. చెట్ల చాటున దాచిన జేసీబీని గమనించి ఫొటోలు తీసి వివరాలు నమోదు చేశారు. రాత్రి పూట అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తూ లారీల్లో తరలిస్తున్న విషయమై తెలుసుకున్నారు. ర్యాంప్‌కు అడ్డంగా రోడ్డు తవ్వించి మట్టిని పోయించారు. వీఆర్ఓ, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా ఇసుక తరలింపు కోసం వచ్చిన లారీలు ఏబీ రోడ్డుపై బారులు తీరాయి.మంగళవారం కూడా లారీలు అలాగే నిలిచిపోయాయి.

ఇసుక తవ్వకాల అడ్డగింత



పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న లారీ



అర్ధరాత్రి ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

పాలకొండ/పాలకొండ రూరల్: మండలంలోని గొట్టమంగళాపురం గ్రామం వద్ద అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. లారీలకు అడ్డంగా నిలబడి ఆందోళన చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేయక తప్పలేదు. ఇందుకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తే...గొట్టమంగళాపురం గ్రామం వద్ద ఇసుక ర్యాంపు ఏర్పాటు కోసం కూటమి నాయకులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం నదిలో ర్యాంపు ఏర్పాటు చేసి సోమవారం రాత్రి ఇసుక తవ్వేందుకు రంగం సిద్ధం చేశారు. నదిలో జేసీబీ ఏర్పాటు చేసి లారీల్లోకి ఇసుక లోడ్ చేయడంతో గ్రామస్తులు, గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తలు గుర్తించి అడ్డుకున్నారు. ఇసుక తవ్వకం దారులకు, గ్రామస్తులకు గొడవ జరగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. లారీలను స్టేషన్‌కు తరలించి అక్కడ వివాదం సద్దుమణిగించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ చంద్రమౌళి తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన తిరుపతి

తెర్లాం: తనను, ఇద్దరు పిల్లలను కాదని వేరే వ్యక్తితో భార్య వెళ్లిపోయిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెర్లాం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మెండి తిరుపతి(32)కి అదే గ్రామానికి చెందిన స్వాతితో 2017లో వివాహం జరిగింది. వారికి ఆరేళ్ల భార్గవ్‌కుమార్, మూడేళ్ల స్వరూప ఉన్నారు. తిరుపతి మద్యానికి బానిస కావడంతో విసిగిపోయిన భార్య తిరుపతిని, ఇద్దరు పిల్లలను విడిచిపెట్టి వేరే వ్యక్తితో హైదరాబాద్ వెళ్లిపోయింది. దీంతో గ్రామ పెద్దల వద్ద పంచాయితీ పెట్టినా భర్తతో ఉండనని చెప్పి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన తిరుపతి మద్యానికి మరింతగా బానిసయ్యాడు. ఆదివారం తన తండ్రి వద్ద రూ.500 తీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయాడు. రెండు రోజులుగా ఇంటికి రాలేదు. మంగళవారం ఓ వ్యక్తి మామిడి చెట్లు కొట్టడానికి రాజయ్యపేట మామిడి తోటకు వచ్చి శ్మశాన వాటిక గదిలో తిరుపతి ఉరివేసుకుని ఉండడాన్ని గమనించి గ్రామస్తులకు తెలియజేశాడు. దీంతో గ్రామస్తులు, తిరుపతి కుటుంబసభ్యులు వెళ్లి చూసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. గ్రామపెద్దల సమక్షంలో మృతదేహానికి శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి గురువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

విజయకేతనం

- బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల సత్తా
- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం కైవసం




రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా బాలికల జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన బాలికల జట్టు సత్తా చాటింది. ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరులో జరిగిన 11వ అంతర్ జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారిణులతో పాటు జట్టు కోచ్ అండ్ మేనేజర్‌లుగా వ్యవహరించిన మజ్జి మధుసూదనరావు, పాలూరి ఆదినారాయణలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రంగారావుదొర, కార్యదర్శి కేవీ ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, కోశాధికారి ఈశ్వరరావులు అభినందించారు.

నాసిరకం విత్తన విక్రయాలపై చర్యలు

- ఆంజనేయ ట్రేడర్స్‌కు షోకాజ్ నోటీస్
- కేసు నమోదు చేస్తామని స్పష్టం చేసిన వ్యవసాయాధికారులు



వరి విత్తనాలు

విజయనగరం ఫోర్ట్: నాణ్యతలేని విత్తనాలు విక్రయించిన డీలర్‌పై వ్యవసాయ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈమేరకు సంబంధిత విత్తన డీలర్‌కు షోకాజ్ నోటీసును వ్యవసాయ అధికారులు జారీ చేశారు. ప్రతి ఏటా వ్యవసాయ అధికారులు ఖరీఫ్, రబీ సీజన్ ఆరంభంలో విత్తన శాంపిల్స్ సేకరించి వాటి నాణ్యతను పరిశీలించేందుకు తాడేపల్లి గూడెం, తిరుపతి, అమరావతి, విశాఖపట్నంల్లో ఉన్న రీజనల్ కోడింగ్ సెంటర్లకు పంపిస్తారు.అక్కడి నుంచి వచ్చే శాంపిల్స్ వివరాలను విత్తన పరీక్ష కేంద్రానికి పంపిస్తారు.విత్తన పరీక్ష కేంద్రంలో పరీక్షించిన మీదట అ వివరాలను కోడింగ్ సెంటర్‌కు పంపిస్తారు. నాణ్యత లేని విత్తన వివరాలను జిల్లా వ్యవసాయ అధికారికి పంపిస్తారు.

సంపత స్వర్ణ రకం నాణ్యత లేదని నిర్ధారణ :

20224 ఖరీఫ్ సీజన్‌లో 346 విత్తన శాంపిల్స్ తీశారు. ఇందులో 310 శాంపిల్స్ ఫలితాలు వచ్చాయి. 36 శాంపిల్స్ ఇంకా రావాల్సి ఉంది.విత్తన ఫలితాల్లో రాజాంలోని శ్రీ ఆంజనేయ ట్రేడర్స్ నుంచి సేకరించిన సంపత స్వర్ణ రకం విత్తనాలు నాణ్యంగా లేనట్లు రిపోర్టు వచ్చింది. ఈ విత్తనాలను ఈడీలర్‌కు నూజివీడు కంపెనీ సరఫరా చేసింది. దీంతో ఆంజనేయ ట్రేడర్స్ డీలర్‌కు వ్యవసాయ అధికారులు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. నూజివీడు కంపెనీకి కూడా నోటీస్ జారీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు తెలిపారు. అంతేకాకుండా కోర్టులో కేసు పెడతామని చెప్పారు.

విత్తనాల్లో ఉండాల్సిన మొలకశాతం	
విత్తన రకం	మొలకశాతం (100కి)
వరి	80
మొక్కజొన్న (హైబ్రిడ్)	90
మొక్కజొన్న (సాధారణం)	80
వేరుశెనగ	70
పత్తి	75
పెసలు	75
మినుము	75

కరాటే పోటీల్లో విజేతలకు అభినందనలు



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు

విజయనగరం: విశాఖపట్నం జిల్లా గాజువాకలో జరిగిన 3వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్-2024లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14 విభాగంలో అవునాపు ముఖేష్ మణికంత, జస్వంత్ గోల్డ్‌మెడల్స్, కెల్ల ఇందుమతి, తాడుతూరి జోషి చంద్ర , అర్లి పవన్ తేజ, అండలూరి తనీష్ సిల్వర్ మెడల్స్, ఎం.చందన, డి.లిఖిత, డి.చేతన్, ఆకాష్ రిషి శ్యాం ప్రసాద్ బ్రాంజ్ మెడల్స్‌ను అదే విధంగా అండర్-10 విభాగంలో బోని గీతశ్రీ, కె.శ్యామ్‌కుమార్ గోల్డ్ మెడల్స్, బోని చార్విక్, షేక్ నైనీషా, కె. అభిరామ్, పి వేదశ్రీ కార్తీక, ఉసుకూరు లోహిత్ బ్రాంజి మెడల్స్ సాధించారు. వారందరికీ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్ బాబు మంగళవారం తన కార్యాలయంలో అభినందనలు తెలిపారు. క్రీడారంగంలో అతి ముఖ్యంగా కరాటేలో విజయనగరం విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో కూడా విజయాలు సాధించి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ పెంకి అశ్విని, హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రధాన కార్యదర్శి పాండ్రంకి సంతోష్ కుమార్, ఎం.అప్పారావు, ఎరప్రు మురళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులస్తులకు సమన్యాయం చేయాలి



పట్టణ వీధుల్లో భారీ ర్యాలీలో రెల్లికుల సంఘం సభ్యులు

- రిజర్వేషన్‌లో 5 శాతం కోటా కేటాయించాలి
- ఆంధ్రప్రదేశ్ రెల్లికులాల సంక్షేమ సంఘం నిరసన
- పట్టణ వీధుల్లో ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడి

విజయనగరం అర్బన్: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు సమన్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ముట్టడి జరిగింది. తొలుత విజయనగరంలోని వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక బాలాజీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, మయూరి జంక్షన్, ఆర్అండ్‌బీ కూడలి మీదుగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేస్తూ కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అణగారిన, అణిచి వేతకు గురైన కులాల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో కల్పించిన ఫలాలు రెల్లికులస్తులకు నేటికీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలలో ఉన్న మిగతా కులాలతో పోటీపడలేక ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్నామని వాపోయారు. వర్గీకరణలో రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో అవకాశం కల్పిస్తూ విద్య, ఉద్యోగ భద్రతలో ప్రత్యేక చట్టాలు తేవాలని కోరారు. రెల్లి కుల సంఘం విజయనగరంలోని జొన్నగుడ్డి రెల్లివీధి విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ రెల్లికులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు దుర్గారావు, యర్రంశెట్టి పైడిరాజు, రాష్ట్ర కో ఆర్డినేటర్ యర్రంశెట్టి రఘునాథ్, కమిటీ సభ్యులు యర్రంశెట్టి రమణ, ముక్కి కుమార్, సతీష్, దనాల శ్రీను, జలగడుగుల కామేష్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన సభ్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

- అధికారులతో అవగాహన నిర్వహించిన ఎస్పీ



ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భోగాపురం సీఐ రామకృష్ణ

విజయనగరం క్రైమ్: ర్యాగింగ్‌కు పాల్పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ వకుల్ జిందల్ విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు జిల్లాలో వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లా పోలీస్ అధికారులతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించి, అవగాహన కల్పించాలని, విద్యార్థులు సహవిద్యార్థులతో స్నేహపూర్వకంగా వ్యవహరించే విధంగా కళాశాల యాజమాన్యాల సహకారంతో చర్యలు చేపట్టేలా చెప్పాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల శ్రుతి మించి ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించాలని చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చట్టరీత్యా చర్యలు చేపట్టడంతో పాటు అర్ధాంతరంగా వారి చదువు, కెరీర్ కూడా నాశనమవుతుందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గమనించేలా తెలియజేయాలన్నారు. కళాశాలల యాజమాన్యాలు కూడా ర్యాగింగ్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, అధ్యాపకులతో కమిటీలు ఏర్పాటుచేయాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా, ప్రాథమిక స్థాయిలోనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు భీమసింగి కళాశాలను , భోగాపురం సీఐ జి.రామకృష్ణ మహారాజా ఇంజినీరింగ్ కళాశాలను, ఎస్‌కోట సీఐ గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, విజయనగరం రూరల్ ఎస్సై వాసుదేవ్ వేణుగోపాలపురం డైట్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పోక్సోకేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు, జరిమానా

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి గ్రామానికి చెందిన నిందితుడిపై పోక్సోకేసు విచారణలో నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువడింది. మంగళవారం వెల్లడైన ఈ తీర్పు వివరాలు పోలీసులు తెలియజేసిన మేరకు ఇలా ఉన్నాయి. 2021 అక్టోబరులో గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన బవిరెడ్డి రవితేజ (28) మాయమాటలు చెప్పి బిస్కెట్లు ఇచ్చి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి అప్పట్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. ఈ కేసును అప్పటి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ టి.త్రినాథ్ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణలో నిందితుడు రవితేజ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లుగా నేరం రుజువు కావడంతో విజయనగరం పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి కె.నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించారు.

క్విట్‌కార్పొరేట్‌ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విజయనగరం ఫూల్‌బాగ్: ఈనెల 9న జరగనున్న క్విట్‌కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు విజయనగరంలోని అమర్‌భవన్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లను తరిమికొడదామని, బడా కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడుకుందామని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయరంగంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, విత్తనమార్కెటింగ్ రంగాల్లో బడా కంపెనీల ప్రవేశాన్ని, వారి లాభాపేక్ష అరికట్టాలి. కార్పొరేట్ కంపెనీలను నిషేధించాలి. ఈ మేరకు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధానమైన నినాదం క్విట్ఇండియా పిలుపు ఇచ్చిన రోజైన ఆగస్టు 9న క్విట్‌కార్పొరేట్ నినాదంతో అన్ని జిల్లా కేంద్రాలు, మండలకేంద్రాల్లో రైతులు, కౌలురైతులు, వ్యవసాయకార్మికులంతా కలిసి కార్పొరేట్లను తరిమికొట్టాలని, ఈ మేరకు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పి కామేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి అప్పలరాజు, జిల్లా నాయకులు ఒమ్మి రమణ, అలమండ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.